గ్రామ అభివృద్ధికి తోడ్పడతాం

విశాలాంధ్ర-జికే వీధి : గూడెం కొత్త వీధి మండలం పంచాయతీ పరిధి నీలవరం గ్రామస్తులు పిలుపు మేరకు జనసేన పార్టీ బూతు కన్వీనర్ గదుతూరి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, అరకు పార్లమెంటు ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్ నీలవరం గ్రామంలో పర్యటించి సమావేశంలో పాల్గొనడం జరిగింది. .నీలవరం గ్రామ సమస్యలు తెలుసుకున్న జనసేన నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఉన్నటువంటి సమస్యలను తమ దృష్టికి తెచ్చినందుకు ఎంతో బాధ్యతతో గ్రామ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం జనసేన పార్టీ తప్పకుండా పరిష్కారం చేస్తుందన్నారు. సమస్యలను ఉన్నత అధికారులు దృష్టికి కూటమి ప్రభుత్వ దృష్టిలో పెట్టి సమస్యలకు న్యాయం జరిగే విధంగా బాధ్యత తీసుకుంటామని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొయ్యం ఇమ్మాను యేల్, చంటిబాబు వంతెన రాజు ,నాదెల సత్యరావు, తదితరులు పాల్గొన్నారు.

వెలుగు వివోఏలకు మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి

- 6 నెలల బకాయి వేతనాలు చెల్లించాలి
- అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలి
- ఏపీ వెలుగు వివోఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు ఆర్ భాను
- ఏపీ వెలుగు వివోఏ ఉద్యోగులు కార్యాలయం ముందు ఆందోళన

విశాలాంధ్ర-పాడేరు : వెలుగు వివో ఏలకు మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, ఆరు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని అక్రమ తొలగింపులు వేధింపులు నిలుపుదల చేయాలని ఏపీ వెలుగు వివోఏ (యానిమేటర్స్) ఉద్యోగ సంఘ అధ్యక్షురాలు ఆర్ భాను ఆధ్వర్యంలో గురువారం మండల డ్వాక్రా సమైక్య భవనం ముందు పాడేరు మండలంలో పనిచేస్తున్నటువంటి వెలుగు యానిమేటర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో డ్వాక్రా వివో ఏలకు మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ ను తేవడంతో పెద్ద ఎత్తున విజయవాడ ధర్నా చౌక్ దగ్గర ఉద్యమం చేయడంతో ఆ సర్క్యులర్ ను తాత్కాలికంగా నిలుపుదల చేశారన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి నాయకులు చాలామంది ఈ ఈ ఉద్యమానికి మద్దతు తెలిపి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ సర్క్యులర్ ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మాట మార్చి వివో ఏల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ కక్షల తోటే వి ఓ ఏ లకు రావలసిన ఆరు నెలల జీతాన్ని కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని,రాజకీయ వేధింపులతో అక్రమ తొలగింపులు చేస్తున్నారని తక్షణం రాజకీయ కక్ష సాధింపులు అపి ఏ పాపం తెలియని మమ్మలను రక్షించాలన్నారు. అలాగే లాంగ్ పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎల్బీ రాజ్ కుమార్, మండల పరిధిలోని విఒఏలు పాల్గొన్నారు.

ప్రజా సేవకు ఎల్లవేళలా తమ శాఖ సిద్ధం : తహసిల్దార్ రవికుమార్

విశాలాంధ్ర-చింతపల్లి : రెవెన్యూ పరంగా ప్రజలకు అందించవలసిన సేవలను ఎప్పటికప్పుడు అందించేందుకు తమ శాఖ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని తహసిల్దార్ బీ రవికుమార్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు జనన, మరణ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు భూములకు సంబంధించిన మ్యుటేషన్ తదితర సేవలను అందించేందుకు తనతోపాటు తన శాఖ సిబ్బంది ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. అదే క్రమంలో ఆధార్ కు సంబంధించిన సేవల విషయంలోనూ తమను సంప్రదించవచ్చున్నారు. తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను పెండింగ్ పెట్టకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ బాషా గురువారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పీహెచ్‌సీలో సందర్శించిన ఆయన రికార్డులను పరిశీలించారు. రోజువారి రోగుల సందర్శనపై అడిగి తెలుసుకున్నారు. మందుల గదిని ఆయన పరిశీలించారు. పూర్తిస్థాయిలో మందులు ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాలింతల వార్డుకెళ్లిన ఆయన వైద్యం అందుతున్న తీరును బాలింతలను అడిగి తెలుసుకున్నారు. నైట్ వాచ్మెన్, స్వీపర్, వైద్య సిబ్బంది ఉండేలా భవనాలను ఏర్పాటు చేయాలని వైద్యాధికారి రాంబాబు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వైద్యాధికారిణి అంభిక, వైద్య సిబ్బంది శౌరి, దీన, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వెలుగు వీఓఏల సమస్యలు పీడికి జడ్పీటీసీ వినతి

విశాలాంధ్ర-అనంతగిరి : రాష్ట్ర ప్రభుత్వం వెలుగు విఒఎల ను తొలంగి నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండలం కేంద్రంలో రెండవ రోజు సిబ్బంది చేపట్టిన ఆందోళన కార్యక్రంలో స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు హాజరై మద్దతు తెలిపారు. అనంతరం మండల వెలుగు కార్యాలయంలో గురువారం అనంతగిరి. అరకు. డుమ్రిగుడ మండలాలకు చెందిన ఏపిఎం ఆ శాఖ సిబ్బంది లకు ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశనికి హాజరైన పీడి వి. మురళి కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని లిఖితపూర్వకంగా విన్నవించారు. అనంతరం ఈ సందర్భంగా విఒఎల ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మండలంలోని ఉన్న వెలుగు గ్రామై ఐక్య సంఘాలను బలోపేతాన్ని కృషి చేస్తున్న విఒఎలను రాష్ట్ర ప్రభుత్వం విధుల నుండి తొలగింపు విరమించుకోవాలని. మూడు సంవత్సరాల కాలం పరిమితి జీవోను తక్షణమే రద్దు చేయాలని. ఆరు నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలని. గతంలో ఇచ్చిన హామీలను తక్షణమే ప్రభుత్వం పరిష్కారం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోరాటంతోనే సమస్యలు పరిష్కారం సాధ్యం పడతుందనీ ప్రభుత్వం దిగివచ్చేంత వరకు పోరాటాన్ని కొనసాగించాలని తమ మద్దతు వెన్నుదండగా ఉంటుందని. అంతేకాకుండా ఈ సమస్యపై జరగబోయే ఐటీడీఏ పాలకవర్గ సమావేశంలో ప్రస్తావించి సమస్య పరిష్కరించే అంతవరకు తాను కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు నాయకులు కిల్లో మొస్య. మండల విఒఎలా ప్రతినిధులు. ఎం. రంజిత. హరికృష్ణ.దిలీప్. సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు కట్టుబడి ఉండాలి

సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : జాతీయ రహదారి నిర్మాణ పనులకు నిభందనలకు కట్టుబడి దుకాణదారులు సహకరించాలని సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సందర్శించిన ఆయన సాయంత్రం వరకు కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం మండల కేంద్రంలో జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా దుకాణాలను పరిశీలించి సర్వే చేశారు. జాతీయ రహదారి నిర్మాణ అధికారులు నిర్దేశించిన ప్రకారం కట్టుబడి ఉండాలన్నారు. ఇప్పటికే నష్టపోయిన దుకాణదారులకు నష్టపరిహారం చెల్లించడం జరిగిందన్నారు. సంబంధిత అధికారులు సూచించిన ప్రకారం నిర్దేశించిన స్థలాలను అతిక్రమించకూడదని ఆదేశించారు. మూడు రోజుల్లోగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఇన్చార్జి తహసీల్దార్ ముజీబ్, రెవెన్యూ సిబ్బంది, జాతీయ రహదారి అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

నవజాత శిశువు రక్షణ బాధ్యత అందరిదీ : జేసీ డా.అభిషేక్ గౌడ

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : నవ జాత శిశువు రక్షణ బాధ్యత అందరిపైనా ఉందని జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఐసిడి ఎస్, వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా లీగల్ సెల్ అథారిటీ సంయుక్తంగా శిశు సంరక్షణపై గురువారం నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డ సురక్షితంగా ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి గర్భం దాల్చిన దగ్గర నుండి నెలనెలా వైద్య పరీక్షలు చేయించుకున వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు. ఆసుపత్రి ప్రసవం తల్లిబిడ్డకు క్షేమమని అన్నారు. నవజాత శిశు సంరక్షణపై గ్రామీణ ప్రాంతాలలో అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రి ప్రసవాలు తల్లి బిడ్డకు రక్షణ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ ఆసుపత్రి ప్రసవాలు పెరగాలని అన్నారు. ఆసుపత్రి ప్రసవాల వలన వైద్యుల పర్యవేక్షణలో సుఖ ప్రసవం జరిగి తల్లి బిడ్డ సురక్షితంగా ఉంటారని చెప్పారు. వైద్యుల సూచనల మేరకు పుట్టిన బిడ్డకు వ్యాక్సినేషన్ (టీకాలు) వేయించాలని సూచించారు. ఐసిడి ఎస్ పథక సంచాలకులు సూర్యలక్ష్మి మాట్లాడుతూ పుట్టిన బిడ్డలను సంరక్షిద్దామని పిలుపు నిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జమాల్ భాషా, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరిండెంట్ డా. విశ్వామిత్ర తదితరులు పాల్గొన్నారు.

వెలుగు కొత్త ఏపీఎంగా శ్యాంబాబు

విశాలాంధ్ర-కూనవరం : గత రెండు నెలలుగా వెలుగులో బదిలీల కారణంగా నిలిచిపోయిన సేవలను తిరిగి పునరుద్ధరించేందుకు పిఓ ఆదేశాల మేరకు కూనవరం మండలం కొత్త ఏపీఎంగా కే. శ్యాంబాబు విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కోతులగుట్టలోని వెలుగు కార్యాలయంలో ఏర్పాటుచేసిన రివ్యూ మీటింగ్‌లో ఏపీడి దేగలయ్య ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ వీఓఏలు పాల్గొన్నారు. ఈ మీటింగ్‌లో బ్యాంకు లింకేజీ లోన్లు, ఉన్నతి ఆటో రుణాలు, శ్రీనిధి కొత్త రుణాలు తదితర అంశాల గురించి చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో సీసీలు ఎస్ శాంతిరాజు జి సింహాచలం సిబ్బంది పాల్గొన్నారు.

మండల ఎగువ ప్రాంతాల్లో ఐటీడీఏ పీవో పర్యటన

విశాలాంధ్ర-వై.రామవరం : వై.రామవరం మండలం ఎగువ ప్రాంతాలైన గుర్తేడు, దారగడ్డ, మారేడు మిల్లి మండలం ఆకు మామిడి కోట గ్రామాల్లో గుండాంవారం రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పర్యటించారు. అక్కడ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు.ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం విద్యార్థుల కు తాజా ఆహార పదార్థాలను అందించాలని ఆదేశించారు. అలాగే విద్యతో పాటు వైద్యం ప్రధానమైన అంశం అని అనారోగ్యానికి గురైె నప్పుడు వైద్యం అందించడలో నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో గుర్తేడు సర్పంచ్ గొర్లె దుష్యంతుడు, తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని సోలార్ కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టాలి

విశాలాంధ్ర-జీకే వీధి : అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2014-2019 మధ్యలో విశాఖ మన్యం మారుమూల శివారు కొండ ప్రాంతాల ప్రజల గ్రామాలకు విధ్యుత్ వెలుగులు నింపేందుకు సోలార్ విధ్యుత్ ప్లాంట్ల ను ఏర్పాటు చేసి మారు మూల గ్రామాలకు సోలార్ ద్వారా విధ్యుత్ సౌకర్యం కల్పించిదని, అయితే కోట్లాది రూపాయలు విలువ చేసే సోలార్ బ్యాటరీలు, సోలార్ ప్లేట్లు మాయమయ్యాయని దీనిపై సమగ్ర విచారణ జరిపి సంబంధిత దోషుల నుండి ప్రభుత్వ ప్రజల సొమ్మును రికవరీ చేసి దోషులపై తగు చర్యలు తీసుకోవాలని జి.కె.వీధి మండల కూటమి నేతలు మాజీ జిల్లా టిడిపి కార్యదర్శి ముక్కలి మహేష్, రాష్ట్ర ఎస్.టీ సెల్ కార్యదర్శి కొర్రా బలరాం, బి.జే.పి మండల అధ్యక్షులు వనపల జోగిరాజు, దేవరపల్లి సర్పంచ్ సిరిబాల బుజ్జి బాబు, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు బత్తుల సిద్ధర్థ మార్క్, టీ.డి.పీ మండల అధికార ప్రతినిధి మొట్టడం రామకృష్ణ లకే రామారావు తదితరులు డిమాండ్ చేసారు.

విశాలాంధ్ర పార్వతీపురం మన్యం

మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సాయం

విశాలాంధ్ర-జియ్యమ్మవలస: మండలం రావాడ రామభద్ర పురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న నిమ్మక సంజీవరావు ఆకస్మికంగా మృతి చెందిన సంగతి విదితమే. ఆ కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయంగా ఒక లక్ష రూపాయల చెక్కును పార్వతీపురం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ విద్యార్థి తండ్రి నిమ్మక కృష్ణారావుకి గురువారం ఆయన ఛాంబరులో అందజేశారు.గిరిజన సంఘ నాయకులు పాలక రంజిత్ కుమార్, గౌరమ్మ ఉన్నారు.

ఉమ్మడి జిల్లాల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ రంగుముద్రి శివనరేంద్రనాయుడు

విశాలాంధ్ర-బలిజిపేట/ పార్వతీపురం : విజయనగరం, పార్వతీపురం మన జిల్లాల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో డాక్టర్ రంగముద్రి శివ నరేంద్రనాయుడు పోటీ చేయనున్నట్లు తెలిపారు. జెఎన్టియు కాకినాడనుండి ఎంబిఏ డిగ్రీనిపొంది ప్రస్తుత సామజిక సేవాకార్యక్రమాలను నిర్వర్తిస్తు న్నారు. ఈయన స్వస్థలం పార్వతీపురం మన్యం జిల్లాలోని బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామంకు చెందినవారు. గతంలోపార్వతీపురం మన్యం జిల్లా యువజనవిభాగం అధ్యక్షులుగా చేసారు. ఇతని తల్లి డాక్టర్ రంగుముద్రి రమాదేవి కార్పొరేషన్ ఛైర్పర్సన్ గా గత ప్రభుత్వంలో పని చేశారు. తండ్రి డాక్టర్ రంగుముద్రి గణపతి రావు విద్యావేత్తగా మంచి పేరు ఉంది. వీరి కుటుంబానికి చెందిన రంగుముద్రి విద్యా సంస్థల ద్వారా ఎంతోమంది విద్యార్థులను ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దడంతో పాటు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

అమాయక గిరిజన విద్యార్థుల మరణాలు ప్రభుత్వానికి అంతు పట్టవా..?

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కూరంగి గోపినాయుడు

విశాలాంధ్ర-సీతంపేట : పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోప్రతి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎం లను నిర్వహిస్తామని రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సమావేశాలలో చెప్పిన మాటలు గాలి మాటలకే పరిమితమా? ఇంకెన్నాళ్లీ అమాయక గిరిజన విద్యార్థి మరణాలు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్పందించి విచారణ చేపట్టి విద్యార్థి కుటుంబాలకు న్యాయం చేయాలని, ఈ సందర్భంగా సీతంపేట మండలంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కూరంగి గోపినాయుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గేదెల చందు పత్రిక విలేకరులకు తెలిపారు నిన్న అనగా బుధవారం నాడు జియ్యమ్మ వలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో గుమ్మలక్ష్మీపురం మండలం ఒడ్డిడి గ్రామానికి చెందిన నిమ్మక జీవన్ కుమార్ ఏడవ తరగతి విద్యార్థి మృతి చెందడం చాలా విచారకరమని అన్నారు. అందుకు విద్యార్థి మృతికి అతని కుటుంబానికి పూర్తి సానుభూతి తెలియజేశారు. దీనికి ప్రభుత్వ వైఫల్యమే కారణం అన్నారు. రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి వర్యులు ప్రతి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎం లను నియమిస్తామని చెప్పిన మాటలు వాగ్దానాలకే పరిమితం అయ్యాయని అన్నారు. దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి విద్యార్థి కుటుంబానికి 15 లక్షలు నష్టపరిహారం ఇచ్చి వారి కుటుంబానికి ఆదుకోవాలని తెలియజేశారు. అలాగే ప్రభుత్వ అధికారులు అనునిత్యం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలకు పర్యవేక్షణలో ఉండి, వారి యొక్క విద్య, ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనియెడల ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ కలుపుకొని పెద్ద ఎత్తున గిరిజన శాఖ మంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

విద్యార్థుల మరణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

- గిరిజన, దళిత ప్రజాసంఘాలు
- ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి
- మృత్తిని కుటుంబానికి 25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలి
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలి

విశాలాంధ్ర-కురుపాం : వరుసగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థులు చనిపోతున్న తీరు పట్ల సమగ్ర దర్యాప్తు చేపట్టాలని గిరిజన, దళిత ప్రజాసంఘాల నాయుకులు టీ. జీవన్, కుండంగి లింగరాజు, గరుగుబిల్లి సూరయ్య, పువ్వల ప్రసాద్ డిమాండ్ చేసారు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పలు హాస్టల్ లను పర్యటించి సంబంధిత అధికారులతో మాట్లాడడం జరిగింది, పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ ఓకే రోజు రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 7 వ తరగతి చదువుతున్న నిమ్మక జీవన (12)అలాగే కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ విద్యార్థి నిమ్మక నితిన్(9) మృతిచెందడం చాలా బాధాకరమని విద్యార్థుల మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ప్రజా సంఘాల నాయుకులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు, మాట్లాడారు. ఈ ఇద్దరే విద్యార్థి కాకుండా ఈ మధ్యకాలంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో అధికార, అనాదికార లెక్క ప్రకారం పన్నెండు మంది విద్యార్థులు మరణించారని, ఇంత జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం కానీ, ప్రభుత్వ జిల్లా అధికారులు కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు,కొన్ని వందల మంది విద్యార్థులతో ఉన్నటువంటి హాస్టళ్లకు వారి ఆరోగ్యాన్ని, యోగక్షేమాలు చూసుకోవడానికి కనీసం హాస్టల్ కు ఒక ఏఎన్ఎం ను కూడా వెయ్యకపోవడం చాలా బాధాకరమని గిరిజన విద్యార్థులు అంటే గిరిజనలు ప్రాణాలు అంటే ప్రభుత్వానికి అంత చులకన అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏఎన్ఎం లను వేసి గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని అలాగే మృతిచెందిన విద్యార్థులు కుటుంబాలకు 25 లక్షలు రూపాయలు నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, మోహన్‌రావు, సింగన్న, పత్తు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేలాలను సద్వినియోగం చేసుకోవాలి

ఐటిడిఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-సీతంపేట : ఐటిడిఏ ఆధ్వర్యంలో సీతంపేట వైటీసీలో నిర్వహించిన జాబ్ మేలాకు 45 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐటిడిఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఐటిడిఏ ద్వారా చేపడుతున్న జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎంపికైన అభ్యర్థులు శిక్షణ అనంతరం తప్పకుండా ఉద్యోగంలో చేరాలని అన్నారు. శిక్షణలో ఉద్యోగానికి సంబంధించిన అన్ని అంశాలను నేర్చుకోవాలన్నారు. హెచ్ వీసీఎల్ ఆధ్వర్యంలో నడుపుతున్న స్కిల్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ వారి సహకారంతో ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్‌లి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ విశాఖపట్నంలో 3 నెలల పాటు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఏపీవో చిన్నబాబు, వెలుగు డిపిఎం ఆర్.వి.రమణ, బొల్లినేని మెడి స్కిల్స్ ప్రతినిధి నాగేశ్వరరావు, ఇతర ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 18 మంది విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-మక్కువ : మండలంలోని ములక్కాయవలస ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఏపీ స్కూల్ గేమ్స్ అండర్ 14 అండర్ 19 విభాగంలో 18మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారు. ఈమధ్య కాలంలో విజయనగరం మరియు, కర్నూలలో జరిగిన ఆటల పోటీలలో వివిధ ఆటలలో విద్యార్థులు పాల్గొని గెలుపొందారు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 18 మంది విద్యార్థి విద్యార్థి గురువారం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రత్నకుమారితోపాటు ఎస్ఎంసి స్కూల్ చైర్ పర్సన్ శిష్టు భారతి మరియు పీడి మోహన్ రావు స్కూల్ ఉపాధ్యాయ బృందం అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా క్రీడారంగంలో పాల్గొని విజయం సాధించి స్కూల్‌కి పేరు ప్రతిష్టలు తేవాలని ఎస్ఎంసి చైర్ పర్సన్ శిష్టు భారతి మరియు ప్రిన్సిపాల్ రత్నకుమారి కోరారు.

సజావుగా నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు నిర్వహించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను సజావుగా నిర్వహించాలని, ఇందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. నీటి వినియోగ దారుల సంఘాల ఎన్నికలపై బీసీ, సబ్ కలెక్టర్లు, ఈఈలు, తహశీల్దార్లతో గురువారం ఉదయం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి నవంబర్ 10న గ్రామ పంచాయతీ, మండల పరిషత్, తహశీల్దారు కార్యాలయాల్లో ఓటర్ల జాబితా ప్రచురణ చేసి అందు బాటులో ఉంచుతారన్నారు. వాటిపై అభ్యంతరాలను నవంబర్ 11 మరియు 12వ తేదీల్లో సంబంధిత తహశీల్దారులు స్వీకరిస్తారని తెలిపారు. అభ్యంతరాల అనంతరం 13న జాబితా సిద్ధం చేస్తారని, వాటిపై కూడా అభ్యంతరాలు ఉంటే నవంబర్ 14,15వ తేదీల్లో పాలకొండ మరియు పార్వతీపురం సబ్ కలక్టర్లు స్వీకరిస్తారని కలెక్టర్ చెప్పారు. స్వీకరణ అనంతరం సిద్ధంచేసిన జాబితాను జిల్లా కేంద్రానికి పంపడం జరుగుతుందని, వీటిపై కూడా అభ్యంతరాలు ఉంటే నవంబర్ 18 నుంచి 20లోగా కమీషనర్, సిఏడిఏ,జలవనరుల శాఖ, విజయవాడ వారికి తెలియజేయవచ్చని చెప్పారు. 20నతుదిజాబితా సిద్ధం అవుతుందని కలెక్టర్ స్పష్టం చేసారు. ప్రతీ ఓటరు నోటిఫికేషన్ తేదీ నాటికి రెవిన్యూ రికార్డుల ప్రకారం భూమి కలిగి ఉండాలన్నారు. పోలింగ్ సమయంలో పాస్ బుక్, అడంగళ్ 1బి తదితర గుర్తింపు ప్రతితో హాజరుకావాల్సి ఉన్నందున, మండల పరిధిలోని గ్రామ రవిన్యూ అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఈ విషయమై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఓటర్ల జాబితాపై చేపట్టిన చర్యలను పాలకొండ, పార్వతీపురం సబ్ కలెక్టర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ వీడియో సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక, సబ్ కలక్టర్లు అసుతోశ్ శ్రీవాస్తవ, యశ్వంత్ కుమార్ రెడ్డి, జలవనరులశాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ అప్పలనాయుడు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, తహశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ



విశాలాంధ్ర-సీతంపేట : జగద్గురు పీఠం అంతర్జాతీయ అధ్యక్షులు మాస్టర్ పార్వతి కుమార్ 80 వ జన్మదిన సందర్భంగా శ్రీ వాల్మీకి వనవాసి శ్రేయో సంస్థ ఆధ్వర్యంలో ఘనంగ జరుపుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంకి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఆదాయపన్నుల కమీషనర్ సిరి కుమార్ పాల్గొన్నారు. ఈయన చేతుల మీదుగా 400మంది వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంకి శ్రీ వాల్మీకి వనవాసి శ్రేయం సంస్థ అధ్యక్షులు పెంటయ్య మాస్టర్, భారతి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, భాస్కర్‌రావు, హడ్డుబంగి యూత్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్.సి. నెం.190/2015-ఎ1, తేది : 07-11-2024, నగర పంచాయతీ కార్యాలయం, పాలకొండ

బహిరంగ వేలం ప్రకటన

పాలకొండ నగర పంచాయతీకి సంబంధించి ఎలక్ట్రికల్ ఫ్యూజ్ కాల్ ఆఫీసు దగ్గర గల దుఖాణ సముదాయములో గల 11 షాపుల్లో షాపు నెం. 1, 4, 5, 6 & 7 గల షాపులను మూడు సం.ల కాలమునకు లీజుకు ఇచ్చుటకు తేది. 14-11-2024 నాడు ఉదయం గం. 11.00లు నుండి నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈ దిగువ సంతకముదారు సమక్షంలో గానీ లేదా వారి అనుమతి పొందిన అధికారి సమక్షంలో గాని బహిరంగ వేలం నిర్వహించబడును.

షాపు నెం.	కొలతలు	నిర్ణయించబడిన ప్రారంభ అద్దె రేటు	ధరావత్తు
1.	10.2' x 6'	రూ. 2,524/-	రూ. 2,500/-
4.	10.2' x 8'		
5.			
6.			
7.			

పైన తెలిపిన వివరముల ప్రకారం బహిరంగ వేలం నిర్వహించబడును. వేలంలో పాల్గొనదలచినవారు తేది. 13-11-2024 సాయంత్రం లోగా రూ.50,000/- విలువకు తక్కువ లేకుండా సాల్వెన్సీ సర్టిఫికేట్ మరియు నోడ్యూస్ సర్టిఫికేట్ సమర్పించవలెను. వేలం పాటలో ఖరారు కాబడిన అద్దె రేటుననుసరించి మూడు నెలలు అద్దెను (18% జీఎస్టీ అదనం) డిపాజిట్‌గా చెల్లించవలసియున్నది. నగర పంచాయతీకి బకాయిలు ఉన్నవారు పాటలో పాల్గొనుటకు అనర్హులు. ఇతర వివరములకు కార్యాలయ పనివేళలలో సంబంధిత విభాగ అధికారులను నేరుగా సంప్రదించి తెలుసుకోవచ్చును.

సం/- కమీషనర్
పాలకొండ నగర పంచాయతీ

డ్రైవర్ల భద్రతకు సంస్థ కట్టుబడి ఉంది

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: డ్రైవర్ల భద్రతకు సంస్థ కట్టుబడి ఉందని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఈఎస్.కె.దుర్గ అన్నారు. గురువారం డిపోలో ఆమె మాట్లాడుతూ నవంబర్ ఒకటి నుండి ఏడో తారీఖు వరకు డ్రైవర్ల హ్యాపీ వీక్ నిర్వహించడం జరిగిందన్నారు. ఒకటి నుంచి మూడో తారీకు వరకు డ్రైవర్ నుండి వివిధ రకాలైన అర్జీలను తీసుకొని నాలుగు ఐదు ఆరు తారీకులలో బస్సులు యొక్క రిపేర్లు అటెండ్ చేసి, మరల ఏడవ తేదీన డ్రైవర్లకు తెలియజేయడం జరిగిందన్నారు. ఈ విధంగా చేయడం వలన డ్రైవర్ ఆనందించడమే కాకుండా అధిక ఉత్సాహంతో పనిచేయగలరని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు 40 అర్జీలు తెలుపగా వాటిని వెంటనే అటెండ్ చేయడం జరిగిందని ప్రతినెల ఒకటి నుంచి 7వ తారీకు వరకు డ్రైవర్లు హ్యాపీ వీక్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- ఇష్టారాజ్యంగా అక్రమ వాణిజ్య భవన సముదాయ నిర్మాణాలు
- మండిపడుతున్న గిరిజనులు

విశాలాంధ్ర-అరకులోయ : వడ్డించేవాడు మనవాడైతే చివరి బంతిలో కూడా పంచభక్ష పరవన్నాలు తీసుకోవచ్చన్న పాత నానుడినీ నిజం చేసే విధంగా అరకులోయ పర్యటక కేంద్రంలో ఘటనలు కళ్ళకి ఎదురుగా సాక్షాత్కారం అవుతున్నాయి. దీనికి సంబంధించిన వివరాల్లోకి వెళితే అరకులోయ పాడేరు ప్రధాన రహదారిలో పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఎదుట అరకులోయ పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసుబాబు భారీ అక్రమ వాణిజ్య సముదాయ భవనాన్ని నిర్మిస్తున్నారు. దీనిపైన ఎప్పటికప్పుడు వివాదాలు చెలరేగుతున్నాయి. పశుసంవర్ధ శాఖకు చెందిన స్థలంలో సర్పంచ్ దాసుబాబు అక్రమ వాణిజ్య సముదాయం నిర్మిస్తున్నారని ఆ శాఖ అధికారులు ఇప్పటికే స్థానిక తహసిల్దార్ కు పాడేరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా స్థానిక గిరిజన సంఘాల నాయకులు కూడా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందజేశారు. అయినప్పటికీ యదేచ్ఛగా అక్రమ వాణిజ్య భవన సమూదాయ నిర్మాణ పనులు జరుగుతుండడంపై ప్రతి ఒక్కరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ప్రభుత్వ పాలకుల అండదండలతో కొంతమంది భారీ బినామీలను అడ్డంగా పెట్టుకుని సర్పంచ్ దాసు బాబు ఇష్టారాజ్యంగా వాణిజ్య భవన సమూదాయ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు మండిపడు తున్నారు. ఈ వాణిజ్య భవన నిర్మాణ సముదాయంపై వివాదాలు వెల్లువెత్తుతున్న ఆరోపణలు విజృంభిస్తున్న విమర్శలు రేకెత్తుతున్న ఉన్నతాధికారులు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు మౌనంగా ఉండి పోతున్నారని ఈ ప్రాంత ఆదివాసి ప్రజలు మండిపడుతున్నారు. అరకులోయ శాసనసభ్యులు మత్స్యలింగం స్వయంగా ఈ అక్రమ వాణిజ్య భావన సమూదాయాన్ని నిలిపివేయాలని ఆదేశించిన అధికారులు మాత్రం ఎమ్మెల్యే ఆదేశాలను అమలు చేయకపోవడం విస్మయనికి గురిచేస్తుంది. అంతేకాకుండా గత కలెక్టర్ అలాగే ప్రస్తుత కలెక్టర్ దినేష్ కుమార్ కూడా ఈ అక్రమ వాణిజ్య భవన సమోదాయ నిర్మాణ పనులను నిలిపివేయాలని స్థానిక రెవెన్యూ అధికారులకు ఆదేశించడం జరిగింది. అయినప్పటికీ అరకులోయ- పాడేరు ప్రధాన రహదారిలో రెవెన్యూ కార్యాలయానికి అతి సమీపంలో పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఎదుట యదేచ్ఛగా అక్రమ వాణిజ్య భవన సముదాయం నిర్మాణం జరుగుతుందంటే దీని వెనక ప్రస్తుత అధికార ప్రభుత్వ పాలకుల హస్తం ఉన్నట్లు ఈప్రాంత గిరిజనులు కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. ప్రభుత్వ అండ దండాలతోనే ఓ ప్రభుత్వ శాఖకు చెందిన స్థలంలో దర్జాగా అక్రమ నిర్మాణం జరుగుతుందని గిరిజనులు గిరిజన సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ప్రభుత్వ అండ దండాలు లేకపోతే ఎన్ని వివాదాలు వచ్చిన అధికారులు పనులు నిలిపివేసిన స్వయంగా నియోజకవర్గ ఎమ్మెల్యే పనులు నిలిపివేయవలసిందిగా ఆదేశించిన వీటన్నింటిని తిరస్కరించి దర్జాగా పనులు సాగుతుండడంపై ఈ ప్రాంత గిరిజనులతో పాటు ప్రజాసంఘాల నాయకులు, స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధులు, పలు రాజకీయ పక్షాల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో రాజకీయ నాయకుల అండదండలను అడ్డంగా పెట్టుకుని ప్రస్తుత సర్పంచ్ పెట్టేలి దాసుబాబు నిబంధనలకు తిలోదకాలిచ్చి రాజ్యాంగాన్ని ధిక్కరించి అధికారుల ఆదేశాలను ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా 10 భారీ వాణిజ్య సముదాయ అక్రమ నిర్మాణాన్ని నిర్మిస్తున్నట్లు గిరిజనులు, నిరుద్యోగులు, ప్రజాసంఘాల నాయకులు ఆగ్రా ఆవేశాలను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తమ ప్రభుత్వానికి ఎటువంటి అవినీతి మచ్చ అంటకుండా ఉండాలంటే అరకులోయ ప్రధాన రహదారిలో పశుసంవర్ధక శాఖ ఖాళీ స్థలంలో టిడిపి నాయకులు చేపడుతున్న అక్రమ వాణిజ్య భవన సముదాయ నిర్మాణాన్ని నిలిపివేసి తమ నిజాయితీని నిరూపించుకోవాలని ఈ ప్రాంత గిరిజనులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేనిపక్షంలో కూటమి ప్రభుత్వం అవినీతి అక్రమాలకు ప్రోత్సహం కల్పిస్తుందనే అపోహ ప్రజల్లో బలపడుతుందని దీని ద్వారా భవితంలో కూటమి ప్రభుత్వానికి ఇబ్బంది కలగక మానదని ఈ ప్రాంత ప్రజలు గుర్తు చేస్తున్నారు.

ఆరు మాసాలుగా జీతాలు లేకపోతే ఏమి తిని బ్రతకాలి

ఎస్ రమేష్ చిత్రపటానికి నివాళులర్పించిన సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

విశాలాంధ్ర-చింతపల్లి : ప్రభుత్వాలు మారిన కార్మికుల బతుకులలో మార్పు రాలేదని, సిఐటీయు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. గురువారం చింతపల్లి ఎంపీడీవో మండల కార్యాలయం ఎదురుగా వెలుగు వివో ఏలు, 7,8,9,తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరుగుతుందన్నారు. మొదటి రోజైన గురువారం చింతపల్లిలో హాజరైన చిన్నయ్య పడాల్, దీక్ష శిబిరంలో, ఉమ్మడి విశాఖ జిల్లా సిఐటీయు ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన దివంగత ఎస్.రమేష్ మృతిచెంది నేటికీ ఏడేళ్లవుతున్న సందర్భంగా రమేష్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, అనంతరం మాట్లాడిన చిన్నయ్య పడాల్ గత వైసిపి ప్రభుత్వం నుంచి వెలుగు వివో ఏలు తమ బ్రతుకులపై రోజువారి పని భారం మోపడమే గాక, సరిగ్గా జీతాలు రాకపోవడం, మొబైల్లు పనిచేయకపోవడం వంటి సమస్యలతో పోరాటం చేస్తూనే ఉన్నారని, అయినా ఆ ప్రభుత్వం పట్టించుకోలేదని ఇప్పుడు ఈ రాష్ట్రంలో ఏర్పడిన మూడు పార్టీల ఎన్డీఏ కూటమి కనీసం స్పందించకపోవడం దుర్మార్గమని విమర్శించారు. ఆరు నెలల నుంచి జీతాలు లేక పోతే ఎలా బ్రతకాలని ప్రశ్నించారు, మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ తక్షణమే రద్దుచేసి పెండింగ్ జీతాలు చెల్లించాలని, అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రాలలో జరుగుతున్న దీక్షలకు స్పందించకపోతే, జిల్లా, రాష్ట్రస్థాయి దీక్షలు చేపట్టి ప్రభుత్వాన్ని కదిలిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు, ఈకార్యక్రమంలో వెలుగు వివోఏల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు, దుర్గ, కే సత్యనారాయణ, పి సుమ, కో ద్ర సుబ్బారావు, వి.రామన్న, వెలుగు వివోఏలు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్లపై అవగాహనా కార్యక్రమం

విశాలాంధ్ర-బెలగాం : రోడ్డు ప్రమాదాల నివారణకు రూపొందించిన ఐఆర్ఏడి (ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్)పై సిబ్బందికి అవగాహనా కార్యక్రమాన్ని జిల్లా ఆసుపత్రిలో గురువారం నిర్వహించారు. కలెక్టర్, జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ అధ్యక్షులు ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించామని ఐఆర్ఏడి మేనేజర్ ఎం.శ్రీధర్ అన్నారు. ఐఆర్ఏడి మరియు రవాణా శాఖ ఆధ్వర్యంలో యాభై మంది ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ సిబ్బందికి రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించిన నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ రూపొందించిన ఐఆర్ఏడి (ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్) పై పూర్తి అవగాహనా కల్పించామని ఎం. శ్రీధర్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల కారణాలను విశ్లేషించడం, ప్రమాదాలను తగ్గించడానికి భద్రతా చర్యలు రూపొందించడంలో సహాయపడే సెంట్రల్ యాక్సిడెంట్ డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టంను మద్రాస్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అభివృద్ధి చేసిందన్నారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసి) ద్వారా అమలు చేయడం జరుగుతోందని తెలిపారు. ఐఆర్ఏడి మొబైల్ అప్లికేషన్ ఫోటోలు, వీడియోలతో పాటు రోడ్డు ప్రమాదాల వివరాలను నమోదు చేయడానికి పోలీసు సిబ్బందికి సహాయకారిగా ఉంటుందని వాటిపై పూర్తి పరిజ్ఞానం పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ మరియు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. బి. వాగ్దేవి, రవాణా శాఖ మెడికల్ ఆఫీసర్ డా. పి. నారాయణరావు, రీజనల్ మెడికల్ అధికారి శేషగిరి, జిల్లా పోలీస్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పల్లెనిద్రకు తరలివెళ్లిన జిల్లా అధికారులు

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలోని అన్ని గిరిజన, సాంఘికసంక్షేమ హాస్టళ్లను పటిష్టపరచి మరింత బలోపేతం చేసేందుకు జిల్లాయంత్రాంగం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఒక్కోజిల్లా అధికారి ఒక్కో వసతిగృహాన్ని గురువారం సందర్శించి, అక్కడ విద్యా ప్రమాణాల తీరును రాత్రిపూట స్టడీ అవర్స్‌లో పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశాలు జారీచేశారు. అలాగే రాత్రి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూపల్లె నిద్ర పేరుతో అక్కడే రాత్రికి బస చేయాలని కలెక్టర్ తెలిపారు. తద్వారా వసతి గృహాల్లోని మెనూ, ఆరోగ్య, పరిశు భ్రత, కిచెన్ గార్డెన్, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించి, సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కా రానికి పటిష్ట చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కలెక్టర్ శ్యాంప్రసాద్ ఈఎంఆర్ఎస్, జి.ఎల్.పురంలో బసచేశారు.జిల్లా ఉద్యానవన అధికారి, జోగింపేట లోను, ఈఈ, జలవనరుల శాఖ, సాలూరులో, జిల్లా సాంఘిక రావివలస హాస్టల్ లో,డ్వామా పిడి ద్రీ నర్సిపురం హాస్టల్లో ,జిల్లా బీసీ సంక్షేమాధికారి కురుపాం హెహాస్టల్లో, ఈఈ, ఆర్.డబ్ల్యూ.ఎస్ గరుగుబిల్లి హాస్టల్లో, జిల్లా విద్యాశాఖాధికారి సాలూరు హాస్టల్లో, ఈఈ, గిరిజన సంక్షేమశాఖ భద్రగిరి హాస్టల్లో బస చేశారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి కొమరాడ హాస్టల్లో, ఎస్ఈ, ఏపీఈపిడిసిఎల్ పి.కోనవలస గురుకులంలో, పాచిపెంట మండలం. ఈఈ, ఏపీఈపిడిసిఎల్ గుమలక్ష్మీపురం హాస్టల్లో, జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ శాఖాధికారి డిఎల్.పురం గురు కులంలో, జిల్లా సూక్ష్మ నీటిపారుదల శాఖాధికారి దొరజమ్ము గురుకులంలో, జిల్లా మేనేజర్, పౌర సరఫరాలు దుద్దుకళ్ళు ఆశ్రమ పాఠశాలలో, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్, వెలుగు రావాడ రామభద్రపురం ఆశ్రమ పాఠశా లలో, జిల్లా దేవాదాయ శాఖాధికారి వనజ ఆశ్రమ పాఠశాలలో, ఈఈ, జలవనరులశాఖ-సహాయ భూగర్భ జల శాఖ అధికారి జియ్యమ్మవలస హాస్టల్లో, జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం డోకిశీల ఆశ్రమ పాఠశాలలో రాత్రి బస్సు చేశారు. డీపీఆర్ఓ రావికోన ఆశ్రమ పాఠశాలలో, ఈఈ, ఆర్ అండ్ బి టిక్కాబాయ్ ఆశ్రమ పాఠశాలలో, జిల్లా సర్వే, భూరికార్డుల అధికారి ఎన్.కె.పురం ఆశ్రమ పాఠశాలలో, జిల్లా సరఫరాల అధికారి పద్మాపురం ఆశ్రమ పాఠశాలలో, జిల్లా గనులు, భూగర్భ వనరుల శాఖాధికారి మామిడిపల్లి ఆశ్రమ పాఠశాలలో రాత్రి బస చేశారు. జిల్లా నైపుణ్య శిక్షణ అధికారి పార్వతీపురం హాస్టల్లో, జిల్లా మేనేజర్,మార్క్ ఫెడ్ మరిపివలస ఎస్సీ బాలికల వసతి గృహంలో, ఐసీడీఎస్ పీడీ పార్వతీపురం బాలికల వసతి గృహంలో, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి పి.కోనవలస బాలికల వసతి గృహంలో, జిల్లా ఔషధ నియంత్రణ అధికారి గుమలక్ష్మీ పురం బాలికల వసతిగృహంలో రాత్రిబస చేశారు. గురువారం రాత్రి వసతి గృహాల్లో బస చేసిన అధికారులు, మరుసటి రోజు శుక్రవారం అదే గ్రామాన్ని సందర్శించి బహిరంగ మలవిసర్జన నిర్మూలనపై గ్రామస్తులకు కౌన్సెలింగ్ చేయడం, మరుగుదొడ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలు, వీడివీకేల పనితీరును పరిశీలించడం చేస్తారని, ఒక అంగన్వాడీ కేంద్రం, చెత్త సంపద కేంద్రంసందర్శన, బాల విహార్ కోసం భూమి గుర్తించడం వంటి పనులను జిల్లా అధికారులు చేపట్టనున్నారని కలెక్టర్ తెలిపారు.

పెన్షన్ కోసం పడరాని పాట్లు...

పొట్టకూటికోసం వలసపోయి వికలాంగుడై తిరిగివచ్చి...

విశాలాంధ్ర-కూనవరం : అర్హులను గుర్తించి సంక్షేమ ఫలాలను అందించడమే అధికారుల లక్ష్యం కాగా ఒక వికలాంగుడు పది నెలలుగా ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నా కనీసం సదరం సర్టిఫికెట్ కూడా మంజూరు కాకపోవడం చూస్తే శాఖలమధ్య సమన్వయం ఏస్థితిలో ఉందో తెలుస్తుంది. గత ఏడాది ఇక్కడ పనులులేక పట్టణానికి వలసపోయాడు. పైడిగూడెం గ్రామానికి చెందిన దళిత యువకుడు బత్తుల కొమరయ్య(30) అక్కడ భవనిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న కొమరయ్యకు కుడి కాలుకు ఇనుపమేకు బాగాలోపలికి గుచ్చుకుంది. అదికాస్త ఇన్ఫెక్షన్ అయి చివరకు కాలుతీసేసే పరిస్థితికి ఏర్పడింది. అసలే కటిక పేదరికం. కొమరయ్యకు భార్య ఇద్దరు పిల్లలు. గతేదాది డిసెంబర్‌లో సూర్యపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాలుతీసేసారు. చేసేదిలేక అంగవైకల్యంతో ఇల్లు చేరిన కొమరయ్యకి పూట గడవడం కష్టంగా మారింది. భార్య కూలి పనులకు వెళ్తుంది. కొండంత దుఃఖాన్ని పంటిబిగువున ఆపుకొని ఆరోజు నుంచి సదరం సర్టిఫికెట్ కోసం ఒంటి కాలుతో అడుగు ముందుకు వేశాడు.పది నెలలకాలం గడిచిపోయింది. ఇంతవరకు సదరం సర్టిఫికెట్ రాలేదు. అది వస్తే గాని పెన్షన్ రాదు. ఎన్నికలప్పుడు తప్ప ఏ నాయకుడికి తాము కష్ట కాలంలో గుర్తురామంటూ కొమరయ్య కన్నీటి పర్యంతమయ్యాడు. అధికారులు తన కష్టాన్ని గుర్తించి సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాల్సిందిగా కొమరయ్య వేడుకుంటున్నాడు.

మన్య ప్రాంత ఉద్యోగ నియామకం ప్రత్యేక చట్టం అమలుచేయాలి

సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పీ.అప్పలనర్సయ్య

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : మన్యప్రాంత ఉద్యోగ నియామక ప్రత్యేక చట్టం అమలు చేయాలని అల్లూరి జిల్లా సిపిఎం పార్టీ ప్రధాన కార్యదర్శి పి. అప్పల నరసయ్య డిమాండ్ చేశారు. స్థానిక మండల కేంద్రంలోని కమ్యూనిటీ భవనంలో గురువారం ఆ పార్టీ మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ తోపాటు స్పెషల్ డిఎస్సి కలిపి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. జీవో నెంబర్ 3ను పునరుద్ధరిస్తానంటూ ఎన్నికల ముందు అరకులో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చినా హామీ ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన చేయలేదన్నారు. అధికారం చేపట్టి నాలుగైదు క్యాబినెట్ సమావేశాలు జరిగిన అందులో దీనిపై ఎటువంటి చర్చ కూడా జరపలేదని విమర్శించారు. రేపటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలలో షెడ్యూల్డ్ ఏరియా ఉద్యోగ నియామక చట్టంపై చర్చించి చట్టం చేసిన తర్వాత మెగా డీఎస్సీ ,స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. పివిటిజి గిరిజనులకు మంజూరు చేసిన పీఎం జన్మన్ గృహ పథకంలో భాగంగా లబ్ధిదారులకు ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఈనెల 8నుంచి 14 వరకు ప్రజా పోరు కార్యక్రమాన్ని ప్రతి మండలాలు చేపట్టడం జరుగుతాదని, చివరి 14 రోజున అన్ని మండల కేంద్రంలో నిరసన ప్రదర్శనలు చేయడం జరుగుతుందన్నారు. ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తామని చెబుతున్న ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కడ అమలు కావడం లేదన్నారు. మద్యం యంత్రంగా చేపడతామని చెప్పి ఇప్పుడు విచ్చలవిడిగా మద్యం విక్రయాలు చేపడుతున్నారని విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే నిలుపుదల చేసే విధంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ పై రాష్ట్రవ్యాప్తంగా రూ17400 కోట్లు భారాన్ని ప్రజలపై మోపారు అన్నారు. పెదపాడు శీలం ఉంది వంతెనలను వెంటనే నిర్మించాలి:- మండలంలోని పెదపాడు, శీలం గొంది గడ్డల్లో వెంటనే వంతెనలు నిర్మించాలని చెప్పారు. శీలం గొంది వంతెన 2014లో కురిసిన హుదూద్ తుఫాన్ కు కొట్టుకుపోయిన ఇప్పటికి ఎటువంటి పునర్నిర్మాణ పనులు చేపట్టలేదని చెప్పారు. పెదపాడు ప్రాంత గిరిజనులకు చాపరాయి జలపాతం గెడ్డ వద్ద వంతెన నిర్మించాలని వంతెన లేక ఆ ప్రాంత గిరిజనులు రవాణా సౌకర్యానికి వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. దీనికి ముందు పార్టీ జెండాను మండల కార్యదర్శి ఎస్ బి పోతురాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అ పార్టీ నాయకులు పి సురేష్ కుమార్, టి సూర్యనారాయణ, పి సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటు నమోదుకు చివరి తేదీ నవంబర్ 8

విశాలాంధ్ర-గంగవరం : టీచర్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు చివరి తేదీ నవంబర్ 8 అని తాసిల్దార్ సిహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఓటు నమోదుకు చేయించుకోదలచినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం ఈ ఒక్కరోజు మాత్రమే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. కావున టీచర్ ఎమ్మెల్సీ ఓటుకు అర్హులై ఉండి ఓటు కలిగి లేనివారు ఇంకనూ ఎవరైనా ఉన్నచో మీ యొక్క ఓటును ది.08.11.2024వ తేదీ ఒక్కరోజు న నమోదు చేసుకొనవలసినదిగా రంపచోడవరం సబ్ కలెక్టర్ తెలియజేయడం జరిగిందన్నారు.

సవర ఆర్ట్స్ అభివృద్ధికి కృషి

ఐటీడీఏ పీవో

విశాలాంధ్ర-సీతంపేట : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర హ్యాండీక్రాఫ్ట్ శాఖ వారి సహకారంతో సవర ఆర్ట్స్ అభివృద్ధికి కృషి చేస్తామని ఐటిడిఏ పివో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం సీతంపేటలోని పీఎంఆర్సి లో సవర ఆర్ట్స్ యొక్క శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిక్షణలో సవర ఆర్ట్స్ కు సంబంధించిన చిత్రకళను నేర్పించి దాని అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు 25 మందిని ఎంపిక చేశామని వారికి నెల రోజులపాటు శిక్షణ ఇస్తామని అన్నారు. ఈ శిక్షణలో లేపాక్షి సంస్థ వారి సహకారం కూడా తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సవర ఆర్ట్స్ చిత్రాలను పీవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఏపీవో చిన్నబాబు, వెలుగు డిపిఎం ఆర్.వి.రమణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి

విశాలాంధ్ర-బెలగాం : రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా వచ్చే నగదు అకౌంట్ పొందడానికి ఆధార్ సీడింగ్ తప్పనిసరి అని పార్వతీపురం డివిజన్ పోస్టల్ సూపరెంటెండెంట్ రెడ్డి బాబూరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 65 లక్షల మంది ఎన్పిసిఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) లింకు కాలేదని పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో దాదాపు 1 లక్షా 20 వేల బ్యాంక్ అకౌంట్లు ఆధార్ సీడింగ్ మరియు ఎన్పిసిఐ లింకు కానివి ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు, ప్రతీ ప్రాంతీయ సచివాలయ పరిధిలో గల పోస్టాఫీసు ద్వారా ఐపిపిబి (ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంకు) అకౌంట్స్ ప్రారంభించి ఆధార్ సీడింగ్ మరియు ఎన్పిసిఐ లైన్ చేసుకోవాలన్నారు. ఇందుకోసం పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో గల అన్ని హెడ్ పోస్టాఫీసులు, సబ్ పోస్టాఫీసులు బ్రాంచ్ పోస్టాఫీసులు కలిసి 445 పోస్టాఫీసులలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరారు.

ఏనుగుల విడిది కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు

జిల్లా అటవీ శాఖాధికారి ప్రసూన

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఏనుగుల విడిది కేంద్రం ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని జిల్లా అటవీ శాఖాధికారి జి.ఎ.పి.ప్రసూన వెల్లడించారు.పంట నష్టం, మానవ ప్రాణ నష్టం, గాయాలు మరియు పశువుల మరణాల అవకాశాలను తగ్గించడం ద్వారా నిర్దిష్ట ప్రాంతంలో ఏనుగులను నిలువరించడం ఈ కేంద్రం లక్ష్యమని ఆమె తెలిపారు. 2018 నుంచి ఇప్పటివరకు ఏనుగుల దాడుల వల్ల దాదాపు రూ.13 కోట్లు పంట నష్టం జరిగినట్లు అంచనా వేయబడిందని అన్నారు. ఇది 3,500 ఎకరాల్లో సుమారు 4,000 మంది రైతులను ప్రభావితం చేసిందని, ఈ నష్టాలు మెగా శాకాహారులు అయిన ఏనుగుల సహజ ప్రవర్తన యొక్క పరిణామమని తెలిపారు.ఇవి కేవలం ఒక గంటలో 50 నుంచి 60 కి.మీ.వరకు విస్తారమైన దూరాలను తిరిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని, ఆహారం, నీరు, నివాసం కోసం ప్రయాణించే వాటి కదలికలను అంచనా వేయడం కష్టతరమన్నారు.మానవులు,వన్య ప్రాణుల మధ్య ఘర్షణలను తగ్గించేందుకు అటవీ శాఖ చురుకుగా పని చేస్తోందని,పెదబొండపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అవాంఛనీయ సంఘటన దృష్ట్యా, ప్రస్తుతం ఏనుగులు ఉన్నచోట పెద్ద సంఖ్యలో జనం గుమిగూడినందున ఆ ప్రాంతంలో 144 సెక్షన్ విధించాలని తెలియజేసామన్నారు. ఇటువంటి సమావేశాలు జంతువులను మరింత ఆందోళనకు గురిచేస్తాయని, సంఘర్షణ ప్రమాదాన్ని పెంచుతాయని స్పష్టం చేశారు.అటవీ శాఖ ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తుందని, ఎలిఫెంట్ ట్రాకర్లను నియమించామని, వాటి భద్రతను నిర్ధారించ దానికి స్థానిక గ్రామస్తులను వెంటనే అప్రమత్తం చేస్తున్నట్లు వివరించారు.ఏనుగుల కార్యకలాపాల కారణంగా పంటలు దెబ్బతిన్నప్పుడు, బాధిత రైతుల నుండి దరఖాస్తులను సేకరించి, అవసరమైన పరిహారం క్లెయిమ్‌లు ప్రాసెస్ చేయ బడేలా చూసేందుకు అటవీ శాఖ పూర్తి బాధ్యత తీసుకుంటుందన్నారు. బిల్లులను సి ఎఫ్ ఎం ఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం మరియు రైతుల ఆర్థిక నష్టాలను తిరిగి పొందేందుకు పరిహారం ప్రక్రియను సులభతరం చేయడంలో శాఖ శ్రద్ధ వహిస్తోందన్నారు.ఏనుగులు సంచరించే గ్రామాల్లో నివసించే ప్రజల భద్రతను కాపాడేందుకుమరింత నష్టం జరగకుండా నిరోధించడానికి, మానవ- జంతు జీవితాలను పరిరక్షించ దానికి అటవీ శాఖ కట్టుబడి ఉందని చెప్పారు. రెండింటి మధ్య శాంతియుత సహ జీవనం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నట్లు ఆమె వివరించారు.

గ్రామాలలో విద్యుద్దీప కాంతులే లక్ష్యం : సర్పంచ్ పుష్పలత

విశాలాంధ్ర-చింతపల్లి : పంచాయతీ పరిధిలోని గ్రామాలలో నిశీదిని పారద్రోలి నిండు పున్నమిని తలపించేలా విద్యుద్దీప కాంతులు అందించాలన్న లక్ష్యంతో గ్రామ గ్రామాన వీధిలైట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. ఇందులో భాగంగానే పంచాయతీలోని ప్రతి గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా ఎంచుకున్నామన్నారు. జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు కిముదు కృష్ణమూర్తి అభ్యర్థన మేరకు చిన్నగెడ్డ గ్రామంలో సుమారు 100 వీధిలైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. చిన్నగెడ్డ తో పాటు పెంటపాడు గ్రామం వరకు జాతీయ రహదారి మార్గంలో రాత్రి వేళల్లో ప్రమాదాల నివారణకు వీధిలైట్లు ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించడం జరిగిందన్నారు. త్వరలోనే అంతర్ల, కందులుగాదే, మల్లవరం, గడపరాయి, డైలీ నగర్, చుంచుంపూడి తదితర గ్రామాలలోను వీధిలైట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, అదే క్రమంలో మండల కేంద్రంలోనూ అవసరమైన చోట విద్యుద్దీపాలు ఏర్పాటుచేసి గ్రామాలలో అన్ని వీధులను విద్యు ద్దీప కాంతులతో ఉండేలా చూస్తానని ఈ సందర్భంగా ఆమె వివరించారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఉత్తరాంధ్ర పోల్ మాస్టర్స్ చెప్పిందే నిజమైంది

ఉత్తరాంధ్ర విశ్లేషకులు కోడిగుడ్ల రవికుమార్, రవికిరణ్‌లకు ప్రశంసల జల్లులు

విశాలాంధ్ర-పార్వతీపురం : గతకొన్ని నెలలుగా ప్రపంచం ఎంతోఆసక్తిగా ఎదురుచూస్తున్న అగ్రరాజ్యం అమెరికా అధ్యక్ష ఎన్నికఫలితాలు బుధవారంనాడు ప్రకటించే సమయంలో అందర్నీ ఆశ్చర్యంకి గురిచేసాయి. ట్రంప్ తన మేజిక్ కాంపెయిన్, ఎన్నికల వ్యూహాలతో కమల హారీస్ పై పైచేయి సాధించారు. అయితే అగ్రరాజ్య ఎన్నికల ఫలితాలమీద చాలా సర్వే ఏజెన్సీలు హారీస్ వైపు మొగ్గు చూపగా, కెనడియన్ పోల్ ఏజెన్సీ పోల్ మాస్టర్స్ మాత్రం ట్రంప్ దే విజయంగా ముందే తెలిపింది. అయితే ఈ కెనడియన్ ఏజెన్సీ పోల్ మాస్టర్స్ మనభారతీయ వ్యక్తులు ఈమధ్యనే ఒక స్టార్టప్ గా ప్రారంభించడం విశేషం. ఇండియాలో ఎన్నో ఏళ్ళుగా ఎనాలిస్ట్‌గా, వ్యూహకర్తగా ఉన్న కోడిగుడ్ల రవికుమార్, కెనడాలో టెక్నాలజీ నిపుణుడిగా ఉన్న తన సహచరుడు రవికిరణ్‌తో కలిసి ఈ "పోల్ మాస్టర్స్" సంస్థ ద్వారా ప్రభుత్వాలకు, రాజకీయ పార్టీలకు వివిధ సేవలు అందించడానికి నెలకొల్పడం జరిగింది. దీనిలో భాగంగా తమసంస్థ యొక్క నైపుణ్య విలువలు, బ్రాండింగ్, మార్కెటింగ్ కోసం అమెరికా అధ్యక్ష ఎన్నికల డేటా ఎనాలిసిస్, సర్వే నిర్వహించడం అందులో ట్రంప్ కె గెలిచే అవకాశం ఉన్నదని వారం క్రితమే వాళ్ళ వెబ్సైటు లో ప్రకటించడం జరిగిందన్నారు. బుధవారం ప్రకటించిన అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల్లో నిజం అవడంతో వారి బృందం హర్షం వ్యక్తం చేయడం జరిగింది. పోల్ మాస్టర్స్ ఇండియా కార్యకలాపాలు కూడా త్వరలోనే ప్రారంభం చేస్తామని సంస్థ కీలక భాగస్వామి కోడిగుడ్ల రవికుమార్ తెలిపారు. సంస్థ ప్రారంభంలోనే మొదటి సర్వేని సక్సెస్ చేసిన రవికుమార్, రవికిరణ్ లు ఇద్దరు ఉత్తరాంధ్రజిల్లాలు అయినటువంటి పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతవ్యక్తులు కావడం సంతోషించదగ్గ విషయమని, మన ప్రాంతానికి చెందిన విశ్లేషకులు అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ముందస్తు సర్వేలు ట్రంప్ విజయాన్ని గూర్చి చెప్పడం ఎంతో హర్షించదగ్గదని, వారిద్దరికి అన్ని వర్గాల నుండి పెద్ద ఎత్తున ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన రవికుమార్ రవికిరణ్‌లు అంతర్జాతీయ సమాజాన్ని శాసించే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపును ముందస్తుగా ఊహించడం వారి తెలివితేటలకు నిదర్శనమని పలువురు తెలిపారు. పెద్దఎత్తున వారిద్దరికి అభినందనలు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

విశాలాంధ్ర-ఎటపాక : విద్యుత్తుషార్ట్ సర్క్యూట్ తో పూరిల్లు దగ్ధమైన ఘటన ఎటపాక మండలం కృష్ణవరంలో చోటుచేసుకుంది. వివరాలు ప్రకారం అదే గ్రామానికిచెందిన కారం రవి రోజు పనులు నిమిత్తం పనులకు వెళ్ళగా ఇంట్లో ఎవ్వరూ లేని క్రమంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూరిల్లు దగ్ధమైంది. ఆస్తి నష్టం భారీగా వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

కృష్ణకుమారికి జాతీయ సేవా రత్న అవార్డు

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : మండల కేంద్రంలోని గల కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా విధులు చేపడుతూ సమాజ శ్రేయస్సు తన ఆకాంక్షగా భావిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన కే.కృష్ణకుమారి జాతీయ సేవ రత్న అవార్డు పొందడం అభినందనీయమని దుంబ్రిగూడ మండల ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జాతీయ మానవ హక్కుల నేర నిరోధక సంఘం ఆమె సేవను గుర్తించి ఢిల్లీలోని గురువారం జాతీయ సేవారత్న అవార్డు గ్రహీతకు ఘనంగా సత్కరించారు. కేజీబీవీ పాఠశాలలో తనతోపాటు విధులు చేపడుతున్న ఉపాధ్యాయురాలు, దుంబ్రిగూడ మండల ప్రజలు ఆమెకు అభినందించారు.

సీలేరులో క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-సీలేరు : సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ మస్తాన్ వల్లి, డాక్టర్ సౌమ్య ఆధ్వర్యంలో గురువారం ఆసుపత్రి నుండి సీలేరు ప్రధాన కూడలి వరకు క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ పై విజయం, స్క్రీనింగ్ తో సాధ్యం అంటూ ప్రధాన స్లోగన్‌ను ప్రజలకు చేరువ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన ప్రతి పౌరునికి ఉచితంగా పరీక్షలు నిర్వహించబడునన్నారు. ముందస్తు పరీక్ష-క్యాన్సర్ నుండి రక్ష అంటూ అందరికీ సులువుగా అర్థమయ్యేటట్లు వ్యాధి సంక్రమణను గూర్చి పరీక్షల ద్వారా క్యాన్సర్ వ్యాధి గుర్తింపు-తగు జాగ్రత్తలు చికిత్స విధానాలు రిఫరల్ ప్రాసెస్ గూర్చి సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కె.జోజిబాబు, ఆరోగ్య పర్యవేక్షకులు త్రినాధరావు, ఆరోగ్య మహిళా పర్యవేక్షకులు బాలామణి, ఆరోగ్య కార్యకర్తలు సత్యనారాయణ, కేవిఎన్.కుమారి, జడ్పి హైస్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాల పట్ల అవగాహన

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: నేరములపట్ల అవగాహన కార్యక్రమాన్ని గురువారం పార్వతీపురం మన్యం జిల్లా సి సి ఎస్ పోలీసులు స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి ఆదేశముల ప్రకారము సైబర్ నేరములు,చెయిన్ స్నాచింగ్ లు తాళం వేసిన ఇళ్లలో దొంగతనములు జరగకుండా ఉండుట గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమంలు నిర్వహించడం జరిగింది. ప్రజలందరూ గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్‌కి రెస్పాన్స్ ఇవ్వరాదనీ, ఓటీపీ లు ఇతరులకు చెప్పరాదని, తాళం వేసిన ఇళ్లలో విలువైన వస్తువులు డబ్బులు ఉంచరాదని, దొంగ తనాలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ లకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమం లో పార్వతీపురం సి సి ఎస్ క్రైమ్ ఎస్.ఐ.వి.శ్రీనివాస రాజు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని ధనలక్ష్మి పేర్కొన్నారు. మండల కేంద్రం రేఖపల్లి లోని కస్తూర్బా గాంధీ హాస్టల్ నందు గురువారం విద్యార్థులకు మెడికల్ అండ్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. జ్వరం కేసుల కు రక్త పూతలు తీసి ల్యాబ్ కు పంపించారు.ఇక్కడ టైఫాడ్ కేసులు వస్తున్నందున వారికీ క్లోరైనేషన్ చేసిన నీరు వేడి చేసిన నీరు తాగాలని, పరిసరాల పరిశుభ్రత హ్యాండ్ వాసింగ్ గురించి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆమె స్టాక్ రూమ్స్ పరిశీలించారు. అలాగే క్యాన్సర్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్యాన్సర్ కా రకాలు చుట్ట బీడీ త్రాగడం, పొగాకు గుట్కాలు నమలడం, లిక్కర్ తాగటం వంటివిమా నాలి అని తల్లి దండ్రులు కు చెప్పండి అని విద్యార్థులకుతెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ భద్రకాళి, హెచ్ వి పున్నమ్మ, ఏఎన్ఎం పార్వతి , హెచ్ఏ శ్రీనివాస్ ఆశాలు జ్యోతి సుజాత హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

మన్యం విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్/బెలగాం: మన్యం విద్యార్థుల వరుస మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో సుమారుగా 55 వరకు ఆశ్రమం పాఠశాలలు ఉన్నాయని,రెండు ఐటీడీఏలకు పూర్తిస్థాయిలోసిబ్బంది ఉండకపోవడం వలన పర్యవేక్షణ కొరబడిందని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారుల కొరత సరిపడా నిధులు మంజూరు కాకపోవడం.అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ నిర్వహించుకోవడం వలన ఇలాంటి సంఘటనలు అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ నిర్వహించుకోవడం వలన ఇలాంటి సంఘటనను ప్రతిసారి జరుగుతున్నాయన్నారు.దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు.మన్యంలో జరుగుతున్న గిరిజన విద్యార్థులు మరణాలకు రాష్ట్ర ప్రభుత్వం మరియు గిరిజన శాఖ మంత్రి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ విద్యా సంవత్సరంలోనే సుమారుగా ఇప్పటివరకు ఏడుగురు విద్యార్థులు మృతి చెందడం బాధాకరమైన ఆవేదన వ్యక్తం చేశారు.బాధ్యతగా ఉన్న గిరిజన శాఖ మంత్రి గారు ఎటువంటి నివారణ చర్యలు చేపట్టకపోవడం ప్రభుత్వం వైఫల్యమే అన్నారు.మృతిచెందిన గిరిజన విద్యార్థులకు 15 లక్షలు చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.లేనియెడల భవిష్యత్తులో గిరిజన శాఖ మంత్రి ఆఫీస్ ముందు విద్యార్థులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు.

పి.కోనవలస వసతిగృహంలో పల్లె నిద్రలో కలెక్టర్

విశాలాంధ్ర-పాచిపెంట : మండలంలోని పి.కోనవలస ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. వసతి గృహాన్ని సందర్శించి, విద్యార్థులకు అందించే విద్య ప్రమాణాలు, నాణ్యమైన ఆహారాన్ని పరిశీలించి రుచి చూస్తూ సహ పంక్తి భోజనం చేశారు. పిల్లలతో కలిసిమెలిసి వారి కష్టసుఖాలను అడిగి తమతో కలిసి భోజనం చేయడంతోపాటు ఒకరిగా కలిసిపోయిన జిల్లా కలెక్టర్ ను చూసి విద్యార్థులు ఎంతో ఆనందించారు.విద్యార్థులకు పాఠ్యాంశాన్ని బోధించారు. క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. శతశాతం ఫలితాలు సాధించాలని తెలిపారు. జిల్లాలో అన్ని వసతగృహాల్లో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించి వసతి గృహాల్లో సమస్యలు పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట పలువురు అధికారులు పాల్గొన్నారు.

దుర్వ్యసనాలు, మత్తు పదార్థాలకు పిల్లలను దూరంగా ఉంచాలి : ఎస్సై

విశాలాంధ్ర-గంగవరం : పిల్లలను దుర వ్యసనాలకు, మత్తు పదార్థాలకు లోను కాకుండా జాగ్రత్తలు తీసుకునే బాధ్యత తల్లిదండ్రుల దేనని ఎస్సై డి. పోషణం అన్నారు. గురువారం పోలీస్ ఆధ్వర్యంలో ఎల్లాపురం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను ప్రయోజకులను చేస్తేనే పేద కుటుంబాలు అభివృద్ధి చెందుతాయి అన్నారు. దీనికి అవరోధం అయిన మద్యం ,గంజాయి లాంటి వాటికి దూరంగా మీ పిల్లల్ని ఉంచాలి మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా ఎప్పటికప్పుడు పిల్లలకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని కోరారు లోనో యాప్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇల్లీగల్ ఎలక్ట్రికల్ ఫెన్సింగ్ కు బదులు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవాలనిరైతులకు సూచించారు. ఫలాలు ఇచ్చే చెట్లను ఎంత శ్రద్ధతో పెంచి ఫలాలు పొందుతారో , అలాగే ధనికులైన, పేదవారైనా వారి పిల్లలను ప్రయోజకులుగా చేయాలంటే పిల్లల్లో ఆధ్యాత్మిక చింతన, క్రమశిక్షణ ,మంచి చెడులు తెలపడం లాంటి మంచి అలవాట్లను చిన్నతనం నుండే అలవాటు చేయాలన్నారు. అప్పుడే ఇంటికి,సమాజానికి చేయగలిగినంత సహాయం సహకారాలు అందించే మానవతావాదిగా పిల్లలు మారతారన్నారు.

బిల్లులు చెల్లించాలంటూ అంగన్‌వాడీల ధర్నా

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండలంలో ఉన్న అంగన్ వడిలు తమకు గత 9 నెలలుగా మధ్యాహన భోజనానికి సంబంచిన బిల్లులు చెల్లించాలంటూ ఐసిడిఎస్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. గత సంవత్సరం డిసెంబర్ నెల నుండి ఈ సంవత్సరం మే నెల వరకు మద్యాహన భోజనానికి సంబందించిన కూరగాయలు,గ్యాస్,బాలామృతం రవాణా చార్జీలు చెల్లించాల్సి ఉందని , సిడిపిఓని, యూడీసీని అడగ్గా ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ జాప్యం చేస్తున్నారని తెలిపారు,అంతంత మాత్రమంగా ఉన్న తమ జీతాలనుండి ఈ ఖర్చులు భరిస్తున్నామని,మాకు చాలా కష్టంగా ఉందని తెలిపారు. ఇదే విషయం యూడిసిని వివరణ కోరగా తన జాప్యం ఏమి లేదని సిడిపిఓ మేడం ఓటిపి సకాలంలో చెప్పక పోవడం వలనే జాప్యం జరింగదని తెలిపారు,ఇరువురి మధ్య సమన్వయ లోపంతో సకాలంలో బిల్లులు చేయక పోవడం వలన వచ్చిన సొమ్ము రూ 542000 వెనక్కి పోయిందని అంగన్‌వాడి వర్కర్లు తెలిపారు. అనంతరం అంగన్‌వాడి వర్కర్లు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీడీపీఓ మనిమ్మకు అందజేశారు.

పేకాట శిబిరంపై దాడి

పదిమంది అరెస్టు... 11వేలు నగదు స్వాధీనం... ఎస్సై కిశోర్ వర్మ వెల్లడి

విశాలాంధ్ర-కొయ్యూరు : మండలంలో బంగారంపేట పంచాయతీ పరదేశి పాకల గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి పదిమంది పేకాట రాయుళ్లను అరెస్టు చేయడం జరిగిందని కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై కిషోర్‌వర్మ మాట్లాడుతూ తమకు ముందస్తుగా అందిన సమాచారం మేరకు పేకాట శిబిరాలపై తమ పోలీస్ స్టేషన్ సిబ్బందితో దాడులు చేసి పదిమందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 11 200 రూపాయలు స్వాధీనం చేసుకున్నమని తెలిపారు. పట్టుబడిన పేకాట రాయుళ్ల అందరిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై కిషోర్ వర్మ తెలిపారు.

నిరక్షరాస్యులందరూ అక్షరాస్యులు కావాలి : ఎంపీడీవో

విశాలాంధ్ర-గంగవరం : రాష్ట్రంలోని అందరూ అక్షరాస్యులు కావాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పీజీ రామకృష్ణ అన్నారు. గురువారం జరిగిన ఉల్లాస విద్య శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న అందరిని నిర్మ రస్యులకు వచ్చేందుకు చదువు నేర్పించాలని ఒక కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ ఉల్లాస విద్యను వాలంటరీ ద్వారా జరగాలని ప్రభుత్వం ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం షణ్ముఖేశ్వరరావు, ఏపీవో ప్రకాష్, హేమా మాధురి, వాలంటరీ ఉపాధ్యాయులు, వి ఏ ఓ లు, ఎమ్మెస్ఓబిలు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థి మృతిపై డిఈఓ విచారణ

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని రావాడరామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం మృతిచెందిన విద్యార్థి నిమ్మక జీవన్ కుమార్ మృతిపై వాస్తవాలు తెలుసుకునేందుకు జిల్లా అధికారులు మండల ప్రజాప్రతినిధులు వివిధ సంఘాల నాయకులు పాఠశాలకు విచ్చేసి వాస్తవాలు తెలుసుకోవడంలో నిమగ్నమయ్యారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారుల ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారి డాక్టర్ నల్ల తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో అధికారుల బృందం గురువారం విచారణ చేసింది. ఏటిడబ్ల్యూఓ కె.చంద్రబాబుతో కలిసి విచారణ ప్రారంభించారు. ముందుగా సహ చరవిద్యార్థులతో మాట్లాడి ఏమి జరిగిందని అడిగి తెలుసుకున్నారు. తర్వాత ఏమి జరిగిందన్న విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. తిరుపతి, డిప్యూటీ వార్డెన్ ఎల్ గణపతి రావు, ఆఫీస్ సబార్డినేట్ వెంకటేష్,వంట మనిషి రాజేష్‌ల నుండి వాంగ్మూలం తీసుకున్నారు. అలాగే డిప్యూటీ డిఎం. అండ్. హెచ్.ఓ. డాక్టర్. పద్మావతితో మాట్లాడిన డీఈవో నల్ల తిరుపతినాయుడు ఆసుపత్రి వైద్యాధికారి ఆసమయంలోఉన్న ఏఎన్ఎం స్టేట్మెంట్లను కూడా తీసుకున్నారు. వాస్తవం ఏమిటంటే తన కుమారుడు నిమ్మక జీవన్ కుమార్ ఆకస్మిక మరణానికి ఎవరూ కారకులు కాదని మృతిని తల్లిదండ్రులు చెప్పడం గమనార్హం. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి డి.గౌరునాయుడు, మండల తహసీల్దార్ రెడ్డి పకీరు,ఎంపీపీ బొంగు సురేష్, అలమండ పంచాయతీ సర్పంచ్ చంటి, వైస్ ఎంపీపీ నరేష్, రావాడ రామభద్రపురం పిహెచ్ సి వైద్యాధికారిణి డాక్టర్ ఎం శృతి తదితరులు పాల్గొన్నారు. డీఈఓ తిరుపతిరావు నాయుడు విలేకరులతో మాట్లాడుతూ విచారణ చేసిన నివేదికను జిల్లా కలెక్టర్ కు అందజేస్తానని తెలిపారు. ఇదిలా ఉండగా మృతి చెందిన విద్యార్థి నిమ్మక జీవన్ కుమార్ కుటుంబానికి 25 లక్షల రూపాయల పరిహారం, వారి ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ మన్యం జిల్లా కార్యదర్శి కోరంగి మన్మధరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్ వి ఎస్ కుమార్,సిపిఎం నాయకులు కె.గంగునాయుడు, సీతారాం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు తదితరులు డిమాండ్ చేశారు.

ఘనంగా జాతీయ ఆదివాసీ గౌరవ దినోత్సవం

భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ముదస్తు ఉత్సవం

విశాలాంధ్ర-చింతూరు : జాతీయ ఆదివాసి గౌరవ దినోత్సవం, బిర్సముండ150 ముందస్తు జయంతి దినోత్సవం ఘనంగా జరిగింది. చింతూరు డివిజన్, చింతూరు మండలం, పేగ పంచాయితీ, సూరకుంట గ్రామంలో పేగ యూత్ కమిటీ ఆధ్వర్యంలో, గ్రామ పెద్దల నేతృత్వంలో, సోడె శ్రీను అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా, చింతూరు, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి, అపూర్వ భారత్ హాజరయ్యారు. ఈ సందర్బంగా ఐటిడిఏ, పిఓ, అపూర్వ భారత్ మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా 150 వ జయంతి, జాతీయ ఆదివాసీ గౌరవ దినోత్సవం ముందస్తు కార్యక్రమాన్ని మారుమూల గ్రామంలో నిర్వహించుకోవడం ఈ కార్యక్రమానికి తనను భాగస్వాములు చేయడం సంతోషం, ఇది ఒక మంచి అనుభూతి., ఇలానే అభివృద్ధి పదంలో నడవడానికి గ్రామాలు, గ్రామాల యువత, పెద్దలు ఐక్యంగా ముందుండి నడిపించాలని, అందుకు అధికారులుగా తమ సహకారం తప్పక ఉంటుందని తెలియజేశారు. పోలీస్ డిపార్ట్మెంట్ తరుపున సిఐ, తెల్లం దుర్గాప్రసాద్, యస్ఐ రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై పేగ గ్రామ యూత్ కి వాలీబా కిట్ అందజేశారు. స్టేట్ ఎస్ టి కమిషన్ మెంబెర్ చిచ్చడి మురళి, ఎంపిపి, సవలం అమల, టీడీపీ యస్ టి సెల్ సెక్రటరీ సోడె మధు, జనసేన మండల అధ్యక్షులు, మడివి రాజు హాజరయ్యారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్, జాతీయ సమన్వయకర్త మడివి నెహ్రూ, సీనియర్ నాయకులు సోడి మురళి , ముర్రం వీరభద్రం, ఆత్రం నవీన్, ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు, ఆదివాసీ ఉద్యోగ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు తిమ్మ సాయి, తోడం దేశయ్య, ఎంపీటీసీ ఎడమ అర్జున్,ఏ వి ఎస్ పి, జిల్లా అధ్యక్షులు కుంజా శ్రీను,పేగ సర్పంచి, పాయం చంద్రయ్య, మాజీ సర్పంచి సోడె ధర్మమ్మ, వీసం పొద్దయ్య ,లిడ్స్ డైరెక్టర్, యేసు రత్నం, ఆదివాసీ అక్యూపంచర్ డాక్టర్ రవ్వ శాంతి, తదితరులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తికి కేలీల ఏరివేత అతి ముఖ్యం

జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పాచిపెంట : వితనోత్పత్తికి మూడుసార్లు కేలీలను ఏరివేయాలని పిలక దశలో ఒకసారి కంకి దశలో ఒకసారి కోతకు ముందు మరొకసారి కేలీలు ఏరివేస్తే నాణ్యమైన విత్తనం తయారవుతుందని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్ శ్రీనివాసరావు అన్నారు. శ్యామల గౌరీపురం గ్రామంలో ఏపీ సీడ్స్ విత్తన ఉత్పత్తి కోసం వరి నాటిన రైతులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ రైతులు తమ విత్తనాన్ని తామే తయారు చేసుకోవచ్చని తెలిపారు. విత్తన తయారీకి కేలీల ఏరివేత అతి ప్రధానం అని తెలిపారు. నాణ్యమైన విత్తనానికి పొటాష్ తప్పనిసరిగా వేసుకోవాలని అన్నారు. పటాస్ చీడిపేడాల నివారణకు గింజ బరువు, నాణ్యత పెంచడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. భూమిలో ఉన్న పొటాషియంను కరిగించడానికి పొటాషియం సాలిబలైజింగ్ బ్యాక్టీరియా పశువుల గతంలో కలిపి చల్లుకోవాలని భూమిలో కరగని స్థితిలో ఉన్నటువంటి భాస్వరాన్ని కరిగించి పంటకు అందించడం కోసం ఫాస్ఫరస్ శాల్యూబులైజింగ్ బ్యాక్టీరియా ఎంతగానో ఉపయోగపడుతుందని ఈరెండిటినీ రాయితీపై వ్యవసాయ శాఖ అందిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అలాగే ప్రస్తుతం వరిలో పచ్చ దోమ ఆశించిందని నివారణ చర్యలు చేపట్టాలని సుడిదోమ ఆశించే అవకాశం ఉందని అలాగే పాము పొడ తెగులు కూడా ఆశించే ప్రమాదం ఉందని వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని దుబ్బుల మొదలలో దోమను పరిశీలించాలని అనంతరం రైతులు మాట్లాడుతూ జింకు జిప్సం బోరాన్లను మరియు వ్యవసాయ పనిముట్లను రాయితీపై సప్లై చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి తిరుపతిరావు ఏపీ సీడ్స్ టెక్నికల్ అసిస్టెంట్ లావణ్య ఫీల్డ్ సూపర్వైజర్ పుష్పలత పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆశ్రయం కల్పించిన 'మీకై... మేము' బృందం

విశాలాంధ్ర-పాచిపెంట : మండల కేంద్రమైన పాచిపెంట ఏరుకుల వీధికి చెందిన నిరుపేద మహిళలకు 20 అడుగుల రేకులను విరాళంగా అందజేసి మీకై మేము స్వచ్ఛంద సేవా సంస్థ తమ వితరణను నియోజక వర్గంలో తినడానికి తిండి లేక అలమటిస్తున్న వారిని గుర్తించి అలాగే ఇతరాత్ర అవసరాలతో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి తమ వంతుగా ఆర్థిక సహాయం అందిస్తున్న మీకై మేము స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను పలువురు కొనియాడుతున్నారు. నీడ లేక వేలవేలబోతున్న ఎరుకల వీధికి చెందిన గొర్ల గంగమ్మ అనే ఓ నిరుపేద మహిళ అవస్థలను గుర్తించిన సంస్థ ప్రతినిధులు అందించిన దాతృత్వం పలువురికి ఆదర్శం. నిరుపేద కుటుంబానికి నీడనిచ్చిన మీకై.. మేము వెల్ఫేర్ అసోసియేషన్ పాచిపెంట మండల కేంద్రంలో బీసీ కాలనీ సమీపంలో ఉన్న ఎరుకల వీధి సంబంధించిన గొర్లె సంగమ్మ (ఎరుకల) మహిళ ఒంటరిగా జీవిస్తుంది. ఆమె సిమెంట్

ఇటుకలతో ఓచిన్న గదిని నిర్మించుకున్నది. కానీ దానికి పైకప్పు రేకులు వేయడానికి ఆమెకు స్తోమత సరిపోక మధ్యలోనే మధ్యలోనే నిలిచిపోయింది. వర్షం వచ్చినప్పుడు ఆమె నిత్యవసర సరుకులు,వంట సామాగ్రి తదితర గృహ పరికరాలు వర్షంలో తడిసిపో వడముతో ఆమె పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. వర్షం పడిన సమయంలో పక్కింట్లోకి వెళ్లి తలదాచుకుంటు న్నారు. అంతేకాకుండా ఆమె రిబ్బన్స్, బెలూన్స్, దువ్వెనలు, ఊరుఊరు తిరిగి అమ్ముకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. ఆ విషయం మీకై.. మేము వెల్ఫేర్ అసోసియేషన్ సాలూరు వారి దృష్టికి రాగా దాతలు సహాయంతో తనకున్న రెండు గదులకు సరిపడగా రేకులు 20అడుగులవి 14 వేల రూపాయలు ఖర్చుతో వారికి మీకై..మేము వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సభ్యులతో గురువారం పంపిణీ అందజేసి మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్ దాతృత్వాన్ని చాటు కున్నారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఇప్పిలి దిలీప్ కుమార్‌తోపాటు ఈ కార్యక్రమంలో మీకై..మేము బృందం పి.నరేష్ కుమార్, వి.క్రీస్తు రాజు, ఎడ్ల మహేష్, బుజ్జి, బి.గణపతి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం రైతులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగం

వ్యవసాయ సహాయ సంచాలకురాలు జాహ్నవి

విశాలాంధ్ర-చింతపల్లి : ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడంతో పాటు సేంద్రీయ విధానాన్ని ఆచరించడం వలన రైతులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగ ఉంటుందని చింతపల్లి వ్యవసాయ సహాయ సంచాలకురాలు కే జాహ్నవి అన్నారు. మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పశువుల బంధ గ్రామంలో ఇన్చార్జి ఏవో పద్మ శోభ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పాటు సేంద్రీయ విధానంలో సాగు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ లో గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. సేంద్రీయ ఉత్పత్తులను భుజించడం ద్వారా ఆరోగ్యాలు బాగుంటాయన్నారు. ఈ విధానంలో వ్యవసాయం చేస్తే సాగు భూమి ఆరోగ్యంగా ఉండడంతోపాటు ఆ భూమిలో ఏ సాగు చేపట్టిన సత్ఫలితాలు ఇస్తుందన్నారు. రైతులకు ఖర్చులు తగ్గుతాయన్నారు. ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకోవడం తోపాటు ప్రభుత్వాలు రాయితీపై అందించే వ్యవసాయ యంత్ర పరికరాలు, టార్పలిన్లు, విత్తనాలు తదితర వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే క్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు అందించే సలహాలు సూచనలు పాటించి వ్యవసాయం చేసి అధిక ఉత్పత్తిని సాధించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ పి సి. ఎన్ ఎఫ్ యూనిట్ ఇంచార్జ్ కొర్ర మోహన్, వీ ఏ ఏ ఎల్ రాజు, వైకాపా సీనియర్ నాయకుడు సింహాచలం, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం అద్దెకిచ్చిన కార్యదర్శి!

విశాలాంధ్ర-అనంతగిరి : మండలంలోని పట్టణాలు చిలకల గడ్డ పంచాయతీ కేంద్రంలో ఉన్న పాత పంచాయతీ కేంద్ర భవనము అద్దెకిచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయం మండల తాసిల్దార్ మాణిక్యం చిలకల గెడ్డ ఎంపిటిసి మితుల సర్పంచ్ అప్పారావు సమక్షంలో బట్టబయలైంది పూర్తి వివరాల్లోకి వెళితే చిలకలగెడ్డ పంచాయతీ కేంద్రం నేషనల్ హైవే 516 కింద రోడ్లు ఆయన నేపథ్యంలో రోడ్డుకిరువైపులా ఉన్న గృహాలను తొలగించారు అందులో భాగంగా పాత పంచాయితీ కార్యాలయము సమీపంలో ఒక గృహము కోల్పోయింది అయితే అతనికి హైవే వారు కొంత మొత్తం చెల్లించారు అందులో 10,000 ఇస్తే పంచాయతీ కార్యాలయంలో ఉండొచ్చనే త్వరలో నీకు ఇల్లు కట్టుకోవడానికి జాగా ఇస్తానని కార్యదర్శి నమ్మబలికారు. ఈ విషయం స్థానికులకు తెలిసి ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు ఉండడం ఏమిటి అని గురువారం మండల తాసిల్దార్ చిలకలగడ్డ పర్యటనలో ఉన్న సమయంలో స్థానికులు ఫిర్యాదు చేశారు దీంతో తాసిల్దార్ వెళ్లే దర్యాప్తు నిర్వహించగా అసలు విషయం బయటపడింది ఇదేకాక ఆధార్ కార్డుల విషయంలో కూడా కార్యదర్శి కొంత చిలక్కొట్టుడు కొట్టినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి ఈ విషయం పై మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుమార్ ను వివరణ కోరగా ప్రభుత్వం భవనాల్లో ప్రైవేటు వ్యక్తులు ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదని మరి ఏ విధంగా కార్యదర్శి ఇచ్చారో తమకు తెలియదని పూర్తి గా దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జాతీయ కాన్సర్ అవగాహనా దినోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర-కూనవరం : జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా కూనవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. పాన్ లు, గుట్కాలు, పొగ తాగటం, కొన్ని రకాల రసాయనాలు వాడటం, ప్లాస్టిక్ వలన క్యాన్సర్ వస్తుందని ప్రజలు అవగాహనా కలిగి ఉండి మొదటి దశలో గుర్తిస్తే క్యాన్సర్ ను అరికట్టవచ్చని వైద్యుడు సునీల్ కుమార్ రాజీవ్ లు తెలియజేశారు. త్వరలో ఇంటింటికి తిరిగి క్యాన్సర్ పరీక్షలు చేస్తారని ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకి మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ ర్యాలీ లో హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాస్, రత్తయ్య, మల్లేశ్వరి, పార్వతి ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్పాలి : పిఓ

విశాలాంధ్ర-మారేడుమిల్లి : మండలం ఆకు మామిడి కోట జీపిఎస్ పాఠశాలను రంపచోడం ఐటిడిఎస్ పిఓ కట్ట సింహాచలం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నది, అదేవిధంగా విద్యార్థులు ఎంతమంది ఉన్నారని ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజన పథకం పక్కగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు పాఠలు చెప్పాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

విశాలాంధ్ర-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం బొడ్లంక గ్రామంలో వ్యవసాయ ఉద్యానవనం ప్రాంగణంలో మాజీ ఐఏఎస్ అధికారి మనోహర్ ప్రసాద్ సమక్షంలో మా తోట సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి కుంజం నందిని రైతులకు ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన కల్పించడం జరిగింది. అలాగేపంటలు పండించే విధానం, ఎరువులు కషాయాలు ఎలా తయారుచేయాలో ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి వివరించడం జరిగింది. వాటిని ఏ సమయంలో ఎంత మోతాదు పంటలకు వాడవలసి ఉంటుందో వివరించారు. ఏజెన్సీ ప్రాంతంలో రైతులు పండించే పంటలను సేకరించి స్టాల్స్ ఏర్పాటు చేశారు. సమావేశానికి హాజరైన అధికారులకు మన్యంలో పంటలను వివ రించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవనం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ముందస్తు గుర్తింపుతోనే వ్యాధి నిర్మూలన : వైద్యాధికారి

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : ముందస్తు గుర్తింపుతోనే క్యాన్సర్ వ్యాధి నిర్మూలనకు దోహదపడుతుందని స్థానిక వైద్యాధికారి పి. రాంబాబు చెప్పారు. మండల కేంద్రంలోని పీహెచ్సీలో క్యాన్సర్ అవగాహన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షకు స్క్రీనింగ్ తోనే సాధ్యపడుతుందన్నారు. ముఖ్యంగా ఖైనీ, గుట్కా పాన్ పరాగ్, ధూమపానం వంటి అలవాట్లు ఉన్నవారు స్క్రీనింగ్ పరీక్షలను చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఆయన కోరారు. గుంటసీమా పంచాయతీ కేంద్రంలో జరిగిన అవగాహన దినోత్సవ కార్యక్రమంలో టిడిపి యూనిట్ ఇన్చార్జి జక్కయ్య, హెల్త్ అసిస్టెంట్లు ప్రభాకర్ సంజీవ్ స్వామి లోవరాజు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహానికి వివోఏలు వినతి

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : మూడేళ్ల కాల పరిమితి ఉత్వర్వులను రద్దు చేయాలని కోరుతూ వీవోఏల రిలే దీక్ష రెండో రోజుకు చేరుకుంది. రిలే దీక్షలో భాగంగా మండల కేంద్రంలోని అల్లూరి విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న వీవోఏలు ఇన్చార్జి తహసీల్దార్ ముజీబ్ వినతి పత్రాన్ని అందజేశారు. రిలే దీక్షలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర మద్దతుగా మాట్లాడారు. వెలుగులో పని చేస్తున్న వీవోఏల సమస్యలపై ఈనెల 11న జరిగే అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యేలు లేవనెత్తి సమస్య పరిష్కారమయ్యేలా చొరవ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు భాస్కరరావు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.